సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 8, మార్చి, 2025





న్యూస్‌రీల్

కొత్తగూడెం ఓఎస్డీ బదిలీ

సంగారెడ్డి ఎస్పీగా నియామకం



పరితోష్ పంకజ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఓఎస్డీగా విధులు నిర్వర్తిస్తున్న పరితోష్ పంకజ్‌ను పదోన్నతిపై బదిలీ చేశారు. సంగారెడ్డి ఎస్పీగా నియమితులయ్యారు. బిహార్ రాష్ట్రం భోజ్‌పూర్ జిల్లాకు చెందిన ఆయన 2020 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తొలుత గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమితులైన పరితోష్ 2023లో భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2024, జూలై 1న అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కొత్తగూడెం ఓఎస్డీగా పనిచేస్తున్నారు. గంజాయి రవాణను అరికట్టడంలో, గోదావరి వరదల సమయంలో సమర్థంగా విధులు నిర్వర్తించారనే పేరు ఉంది.

మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మరుగుదొడ్ల నిర్మాణాల వద్ద సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: భక్తుల కోసం భద్రాచలంలో ఐటీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శాశ్వత మరుగుదొడ్ల పనుల వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని కాపా రామలక్ష్మి ఏరియాలో, బస్టాండ్, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, పార్క్ పక్కన ప్రదేశాల్లో జరుగుతున్న శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. భక్తులు బస చేసే ప్రదేశాల్లో టాయిలెట్లు, స్నానాల గదులు నిర్మించాలన్నారు. గ్రామపంచాయతీ ద్వారా చేపట్టిన నిర్మాణాలను ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా తొలుత పీఓ ఏఎంసీ కాలనీ, మనుబోతుల చెరువు వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను స్థానికులు వివరించగా.. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాలని ఏఈఈని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న డైనింగ్ హాల్ పనులను పరిశీలించారు. అధికారులు చంద్రశేఖర్, హరీష్, నారాయణ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్ : కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. క్రిమినల్, ప్రమాద, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహ సంబంధ తదితర కేసులను ఇందులో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు.

అడుగు ముందుకే..

'అమ్మే నా తొలి గురువు. ఆమె పెద్దగా చదువుకోలేదు. కానీ నన్ను ముందుకు నడిపించింది. ఎక్కడ పడిపోతే.. అక్కడి నుంచే నీ కొత్త ప్రయాణం మొదలుపెట్టమని చెప్పింది. నన్ను జడ్జిగా చూడాలన్న ఆమె కోరికను నెరవేర్చగలిగాను. మహిళలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలి.' అని ఖమ్మం జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తి కె.ఉమాదేవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో కుటుంబ న్యాయస్థానం జడ్జి అర్చనా కుమారితో కలిసి ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పేజీ లే ఔట్, మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించి సూచనలు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఉమాదేవి మాట్లాడగా ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. –సాక్షిప్రతినిధి, ఖమ్మం



సాక్షి గెస్ట్ ఎడిటర్లుగా పేజీ లే ఔట్‌పై చర్చిస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవి, కుటుంబ న్యాయస్థానం జడ్జి అర్చనాకుమారి

దృఢ సంకల్పంతో సాగితేనే విజయం

- నన్ను జడ్జిగా చూడాలన్నదే మా అమ్మ కల
- జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవి
- మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఎడిటర్‌గా విధులు

నిరాశకు తావివ్వొద్దు..

మహిళలు ఏ రంగాన్ని ఎంచుకున్నా.. అందులో వంద శాతం కృషి చేయాలి. ఏ పనైనా ఇష్టంతో చేయాలి. లక్ష్యాలను చేరుకోవడానికి దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలే తప్ప ఎక్కడో ఏదో జరిగిందని కుంగిపోవద్దు. మనకు మన లక్ష్యమే కనపడాలి. మంచి, చెడును సమానంగా స్వీకరించ గలిగే స్థితప్రజ్ఞత సాధించాలి. మహిళలు ఆత్మస్థైర్యాన్ని ఎప్పుడూ కోల్పోవద్దు. ఇక చాలు నా జీవితం అయిపోయిందనే భావనను మనసులోంచి తీసేయాలి. అప్పుడే అనుకున్న దాని కన్నా మంచి స్థితిలో ఉంటాం. చిన్నతనం నుంచే మహిళలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్యం. వారి లక్ష్యాలకు అండగా ఉండాలి.

అమ్మే నా మొదటి గురువు..

మేము నలుగురు ఆడపిల్లలం. నాన్న ఫిజికల్ డైరెక్టర్. ఆయన అందరినీ లెక్చరర్లుగా చేయాలనుకున్నారు. కానీ నన్ను జడ్జిగా చూడాలన్నది అమ్మ కోరిక. నా మొదటి గురువు ఆమే. ఏం చేయాలి.. ఎలా వెళ్లాలి.. ఎక్కడైతే పడిపోతామో అక్కడే లేచి నిలబడమని చెప్పేది.. అంత సపోర్ట్ ఉండడంతో ఆమె కల నెరవేర్చగలిగాను.

ఎవరేం అనుకుంటారోనని ఆలోచించొద్దు..

మహిళల్లో ఎక్కువ మంది వాళ్లేం అనుకుంటారో.. వీళ్లేం అనుకుంటారో అని ఆలోచిస్తుంటారు. అలా కాకుండా మనమేం అనుకుంటున్నామో అదే ముఖ్యం. నలుగురు ఏమనుకుంటారో అనే భావన తీసేస్తేనే జీవితంలో ఎదగగలుగుతాం. అప్పుడే ఎంత కఠినమైన పనైనా చేయగలం. జీవితంలో ఏదీ సులువు కాదనే విషయాన్ని అంగీకరించాలి.

సాగు చేస్తూ.. దారి చూపిస్తూ!

- యూట్యూబర్‌గా రాణిస్తున్న మహిళా రైతు లక్ష్మీప్రసన్న
- 3.23 లక్షల మంది సబ్‌స్క్రైబర్లతో గుర్తింపు
- పంటలన్నీ సేంద్రియ విధానంలోనే..

బూర్గంపాడు: ఆమె తన భర్త సహకారంతో సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తోంది. సాగు సమయాన ఎదురయ్యే ఇక్కట్లు, పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం సర్వసాధారణమే. అయితే, శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలతో తీసుకుంటున్న రక్షణ చర్యలు సత్ఫలితాలను ఇస్తుండడంతో అవి తనకు మాత్రమే సొంతం కావొద్దని.. మరికొందరు రైతులకూ ఉపయోగపడాలనే భావనతో ఆ మహిళా రైతు అందరికీ అందుబాటులో ఉన్న యూట్యూబ్‌ను ఎంచుకుంది. సాగులో తాము అవలంబించే రక్షణ చర్యలు, జాగ్రత్తలను వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో రైతుల మన్ననలు అందుకుంటోంది. ఇప్పటి వరకు ఏడేళ్లలో 200 పైగా వీడియోలు అప్‌లోడ్ చేయగా.. ఆమె నిర్వహిస్తున్న చానల్‌కు 3.23 క్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం విశేషం.

మారుమూల గ్రామం నుంచి...

పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన పాపాల సాయి లక్ష్మీప్రసన్న ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఆ తర్వాత ఆమెకు రాంబాబుతో వివాహమైంది. భర్తతో కలిసి తమకున్న పదెకరాల భూమిలో వివిధ రకాల పంటలను సేంద్రియ విధానంలో సాగుచేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఎప్పటికప్పుడు పంటల సాగులో వస్తున్న మార్పులు, నూతన సాంకేతిక విధానాలు, నాణ్యమైన ఉత్పత్తులు, మార్కెటింగ్, భూసంరక్షణపై అవగాహన పెంచుకుంది. అయితే, ఈ అంశాలన్నీ అందరికీ చేరవేయాలనే లక్ష్యంతో 'ఎస్ఆర్ విలేజ్ అగ్రికల్చర్ యూట్యూబ్ చానల్' ప్రారంభించింది. ఆర్గానిక్ విధానంలో కూరగాయలు సాగు చేస్తూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించే క్రమాన ఆమెకు ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన తీరు, భూసంరక్షణ, విత్తన శుద్ధి, విత్తనాల ఎంపిక, ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, పంటలు ఆరబెట్టడం, మార్కెటింగ్ వసతులు తదితర అంశాలే కాక వ్యవసాయ అనుబంధ రంగాలైన నాటు కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమపైనా ఆమె అప్‌లోడ్ చేస్తున్న వీడియోలు చాలామందికి ఉపయోగపడుతున్నాయి. సాయి లక్ష్మీప్రసన్న చక్కటి మాట తీరుతో వ్యవసాయ విధానాలను కళ్లకు కట్టినట్లుగా వీడియోలను తమ సెల్‌ఫోన్‌లోనే చిత్రీకరించి ఎలాంటి ఎడిటింగ్ లేకుండానే అప్‌లోడ్ చేస్తుండడం విశేషం. ఈ వీడియోలు చూసిన చాలా మంది రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పిన వాటికంటే బాగా అర్థమవుతున్నాయని చెబుతుండడం ఆమె కృషికి దక్కిన నిదర్శనం. కాగా, యూట్యూబ్ ద్వారా వస్తున్న పారితోషికాన్ని పొలం పనులకు సహకరిస్తున్న కూలీలు, తోటి రైతుల అవసరాలకు అందిస్తుండడం మరో విశేషం.



పంటపై పురుగుల మందు పిచికారీ చేస్తూ...

ఆమె రాణిస్తోంది..

మరికొన్ని కథనాలు 9లో

క్రీడలతో వ్యసనాలు దూరం

ఎస్పీ రోహిత్‌రాజ్

చర్ల: క్రీడలతో చెడు వ్యసనాలను దూరం చేసుకోవచ్చని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఏదో ఒక క్రీడ ఆడాలని సూచించారు. పోటీల్లో మండలం నుంచి 49 జట్లు, ఛత్తీస్‌గఢ్ నుంచి 7 జట్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. మొదటి, రెండో, మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన చీమలపాడు, సుందరయ్యకాలనీ, పెదుట్లపలి(ఛత్తీస్‌గఢ్), మామిడిగూడెం జట్లకు షీల్డ్‌లతోపాటు వరుసగా రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజ్‌కుమార్, సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, పీడీలు పి.శ్రీనివాస్, ఏ ఈశ్వర్, వీ దశమిబాబు, పీ శ్రీను, పీఈటీలు కె.వెంకటేష్, ఎస్.బాబూరావు, రాజేష్, హరికృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విజేత చీమలపాడు జట్టుకు బహుమతిని అందజేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ తదితరులు

ఆలయ పాలకవర్గం జాబితాపై గోప్యం

పాల్వంచరూరల్ : పెద్దమ్మగుడి పాలకవర్గ జాబితాను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడం చర్చనీయాంశంగా మారింది. 14 మంది సభ్యులతో కూడిన జాబితా గురువారం ఈఓకు చేరినా.. వివరాలు వెల్లడించకుండా రహస్యంగా ఉంచారు. జాబితాలో పేర్లున్న వారితో కలిసి ఈఓ, దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం రహస్యంగా సమావేశమై మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఎటువారు అటు వెళ్లిపోయారు. ఆలయ గత పాలకవర్గ పదవీకాలం 2024 మార్చితో పూర్తికాగా, నూతన పాలకవర్గ నియామకానికి దేవాదాయ శాఖ డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో అసక్తి గల 30 మంది నాయకులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో ఎవరికి స్థానం దక్కిందనేది సస్పెన్స్‌గా మారింది.

గనిలో నారీమణులు



కొత్తగూడెంలోని పీవీకే-5 ఇంక్లైన్ గనిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారులు

- భూగర్భంలో సాహస విధులు
- సింగరేణిలో సర్దార్, ఓవర్‌మెన్ పర్యవేక్షణ బాధ్యతలు
- ఏటా సంస్థలో పెరుగుతున్న మహిళా ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగ నిర్వహణలోనూ రాణిస్తున్నారు. అయితే, కొన్నాళ్ల పాటు కార్యాలయాలకే పరిమితమయ్యే ఉద్యోగాలను మాత్రమే ఎంచుకోగా ఇప్పుడు ఈ స్థితినీ దాటేశారు. క్లిష్టమైన పరిస్థితులు, సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించడానికి అతివలు వెనుకాడడం లేదు. అందులో భాగంగానే సింగరేణిలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, పర్యవేక్షణ బాధ్యతలను నిస్సంకోచంగా, విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పురుషులు సైతం భయంభయంగా పనిచేసే రెస్క్యూ విధులనూ మహిళలు ఎంచుకుంటుండడం విశేషం.

మైనింగ్ ఆఫీసర్లుగా మహిళలు..

సింగరేణిలో సుమారు 56 విభాగాలు విధులు నిర్వర్తిస్తేనే బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుంది. వీటన్నింటిలోనూ గతంలో పురుషులే ఉండేవారు. అయితే, ఇటీవల నియామకాల్లో మహిళలకు అన్ని విభాగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం.. డిపెండెంట్ ఉద్యోగాల కల్పనలోనూ సానుకూలంగా వ్యవహరిస్తుండడంతో ఇప్పుడు సంస్థ వ్యాప్తంగా 2వేల మంది మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో కొందరు ఎగ్జిక్యూటివ్ హోదాలో ఎలక్ట్రికల్, మైనింగ్, సివిల్, ఎకౌంట్స్, ఎస్టేట్స్, పర్సనల్ విభాగాల్లో ఉండగా.. ఉత్పత్తికి సంబంధించి మరో 16 విభాగాల్లోనూ మహిళలు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, సింగరేణిలో మైనింగ్ ఆఫీసర్ విధులు క్లిష్టంగా ఉంటాయి. గనుల్లో బొగ్గు ఉత్పత్తి కోసం బ్లాస్టింగ్ చేయడం, గనుల్లో వెలువడే గ్యాస్‌ను గుర్తించడమే కాక మైనింగ్ విభాగంలో సర్దార్, ఓవర్‌మెన్లకు విధులు కేటాయించాల్సి ఉంటుంది. ఇలాంటి విధులను మహిళలు అలవోకగా నిర్వర్తిస్తూ భేష్ అనిపించుకుంటున్నారు.

అటు ఉద్యోగం.. ఇటు ట్రెయినర్



సంస్థలో ఎంజేటీ(మేనేజ్‌మెంట్ ట్రెయినీ) హోదాలో ఉద్యోగం చేస్తూనే రెస్క్యూ ట్రెయినర్‌గానూ కొనసాగుతున్నా. కొన్ని సందర్భాల్లో గనుల్లో వెలువడే గ్యాస్‌తో ప్రాణాపాయం ఎదురవుతుంది. అయినా బీటెక్ మైనింగ్ తర్వాత ఈ ఉద్యోగం ఎంచుకున్నా. – అంబటి మౌనిక

ఆఫీస్ వేరు.. గని వేరు



బొగ్గు బ్లాస్టింగ్ సమయాన అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమరపాటుగా ఉంటే ప్రమాదమే. అందుకే పనిచేసే వారంతా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆఫీస్ పనులకు, ఇక్కడ విధులకు వ్యత్యాసమున్నా చాలెంజ్‌గా తీసుకుని పని చేస్తున్నాం. – ఈసం కృష్ణవేణి

ప్రైవేట్ సంస్థ నుంచి సింగరేణిలోకి..



మైనింగ్ బీటెక్ పూర్తిచేశాక రాజస్తాన్‌లోని హిందుస్తాన్ జింక్ లిమిటెడ్‌లో మూడేళ్లు పనిచేశా. ఆ అనుభవంతో సింగరేణిలో మైనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. కొత్తగూడెం భూగర్భగనిలో నాతో కలిపి ఆరుగురు మహిళా ఉద్యోగులం పనిచేస్తున్నాం. – చెల్లా గాయత్రి

అత్యంత అప్రమత్తంగా..



బొగ్గు ఉత్పత్తి సమయాన ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ఫలితాలు తారుమారవుతాయి. ఈక్రమాన రక్షణ సూత్రాలు తప్పక పాటించాలి. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా పనిచేస్తున్నాం. – రమ్యశ్రీ

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

కొత్తగూడెంఅర్బన్: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులు పరిశీలించాలని, ఎల్–1,ఎల్–2,ఎల్ –3 జాబితాలు తయారు చేయాలని సూచించారు. అర్హత ఉండి కూడా జాబితాలో పేరు రాని వారిని తిరిగి నమోదు చేయాలన్నారు. జాబితాలో తండ్రి పేరు ఉండి, పెళ్లయిన కుమారుడు దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓలు బాధ్యతగా వ్యవహరించి అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా చూడాలని సూచించారు. భూముల క్రమబద్ధీకరణకు ఈనెల 31 వరకు కల్పిస్తున్న 25 శాతం రాయితీని అందరూ సద్వినియోగపరుచుకునే అవగాహన కల్పించాలని అన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి..

పాల్వంచరూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సిబ్బందికి సూచించారు. పాత పాల్వంచ జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, స్పోర్ట్స్ కిట్లను పరిశీలించారు. భోజనం బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. భోజనంలో లోపాలుంటే ఉపాధ్యాయులు, నిర్వాహకులపై చర్య తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా కోఆర్డినేటర్ సైదులు, సతీష్‌కుమార్, ఎంఈఓ శ్రీరాంమూర్తి, హెచ్‌ఎం పద్మలత ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్


'ప్రైవేట్'కు దీటుగా విద్యాబోధన..

సుజాతనగర్ : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యాబోధన అందుతోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం జరగగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యంతో చదివితేనే అనుకున్నది సాధిస్తారని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ వి.బ్యూలారాణి పాల్గొన్నారు.

ఇంట్లో ఓకే.. బయటే భయం !

మహిళలపై కొనసాగుతున్న వివక్ష ● ఇంకా కనిపిస్తున్న ఆడామగ తేడా

సమాజంలో అందరూ సమానేమనే భావన నానాటికీ పెరుగుతోంది. పురుషులతో సమానంగా కుటుంబ పోషణలో పాలు పంచుకుంటున్న మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తుండడం ఇందుకు కారణమవుతోంది. కానీ అతివలపై వివక్ష మాత్రం కొన్నిచోట్ల కొనసాగుతూనే ఉంది. అయితే ఇళ్లలో తల్లిదండ్రులు, తోబుట్టువుల నుంచి ఆ పరిస్థితి ఎదురుకాకున్నా... పని ప్రదేశాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల వంటి చోట మాత్రం ఈ సమస్య తప్పడం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో 100 మంది మహిళలను సర్వే చేయగా ఈ విషయం వెల్లడైంది. 'సాక్షి' అడిగిన ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి. – ఖమ్మంమయూరిసెంటర్/కొత్తగూడెంఅర్బన్





జయహో.. జనయిత్రి

- మహిళల రక్షణ, అభివృద్ధే ధ్యేయంగా..
- కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటూ, ప్రజలతో మమేకం.



శ్రీమతి మల్లు నందిని, అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్

మధిర : రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని నిరంతరం ప్రజల్లో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారు. నిరంతరం శ్రమిస్తూ, ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాల్లో నిత్యం బిజీగా ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉండడంతో పాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ రాజకీయాల్లో సైతం బిజీగా ఉంటున్నారు. మల్లు నందిని నియోజకవర్గంలో కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, నాయకులకు కొండంత అండగా ఉంటున్నారు. మండలాల్లో పార్టీ నాయికులను సమన్వయం చేస్తూ అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా ముందుకు వెళుతున్నారు. అంతేకాకుండా తన భర్త హోదాను దుర్వినియోగం చేయకుండా, అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకోకుండా ఆమె తనదైన శైలిలో రాణిస్తున్నారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాయంగా చేరదీస్తూ మల్లు నందిని చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు. నియోజకవర్గ ప్రజలు ఆప్యాయితగా అమ్మ అంటూ పిలిస్తే, నేనున్నానంటూ కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ, వికలాంగులకు ట్రైసైకిళ్ళు ఉచితంగా పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నారు. నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు ఎవరైనా ప్రమాద ఘటనలో గాయపడినా, మృతి చెందిన వారి కుటుబాలను పరామర్శిస్తూ వారికి అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యాలకు ఫోన్ చేస్తూ వైద్య బిల్లులు తగ్గించేలా కషి చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు, నాయికులు, కార్యకర్తలు ఆమెను తలైవిగా పిలుస్తూ ఫ్లెక్సీలు కడుతూ నందినమ్మకు మహిళా దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అమ్మ ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



విద్యావంతులైన మహిళలందరూ.. సమాజంలో మార్పు తేవడానికి ధైర్యంగా ముందుకు సాగాలని, మహిళలంతా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని, సవాళ్ళను స్వీకరించి, ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరుకుంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

వై. లావణ్య, కరస్పాండెంట్, వికాస్ స్కూల్, ఖమ్మం



మహిళలందరూ విద్యను అభ్యసించాలి, ఆర్థికంగా ఎదగాలి. సంతానలేమి, గర్భాశయ, వెన్నెముక, నరాలు మరియు కీళ్ళనొప్పుల సమస్యలతో బాధపడే పేద ప్రజలకు అధునాతన వైద్యం అందించడం సంతోషంగా వున్నది.

డా॥ అస్మా
గైనకాలజిస్ట్,
షిఫా హాస్పిటల్, ఖమ్మం



మహిళలు విద్యావంతులై తమతోపాటు కుటుంబాన్ని, సమాజాన్ని అభివృద్ధివైపు నడిపించాలి. సమస్యలతో వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నావంతుగా సేవలందించడం నాకు తృప్తిగా వున్నది. మహిళామణులందరికీ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు.

కొడారు సుజాత
కమీషనర్, పాల్వంచ మున్సిపాలిటి,
ఇన్‌ఛార్జ్ : కొత్తగూడెం మున్సిపాలిటి.



మహిళలు అన్నిరంగాలలో ఎదగాలి. స్కిన్ స్పెషలిస్ట్‌గా పేద మధ్యతరగతి ప్రజలకు నిరంతరం తక్కువ ఖర్చులో ఆధునిక వైద్య సేవలు అందించటం సంతోషంగా వున్నది.

డా॥ పోట్ల శాలిని
డెర్మటాలజిస్ట్ మరియు
కాస్మోటాలజిస్ట్,
శాలిని స్కిన్ క్లినిక్, ఖమ్మం



సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రే కీలకం. మహిళలు స్వయంశక్తి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఖమ్మంలో ఏకైక ఎండోక్రైనాలజిస్ట్, మరియు మహిళా ఫిజీషియన్‌గా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవలు అందించటం సంతోషంగా వుంది.

డా॥ కావ్యచంద్ యాలముడి
సి.ఇ.ఓ, కావ్య హాస్పిటల్, ఖమ్మం